సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం ၊ 19 ၊ ఫిబ్రవరి ၊ 2024



..అధ్యాపకుల అవస్థలు
జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లకు వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు.

వివరాలు 8లో ▸



ముగిసిన బ్రహ్మోత్సవాలు
అయిజ మండలం ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ముగిశాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.2/23.3

వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రివేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మున్నూరు కాపుల అభ్యున్నతికి కృషి



గద్వాల అర్బన్: మున్నూరు కాపుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘం అభివృద్ధికి పాటుపడాలని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో ముందుకెళ్లాలన్నారు. మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తానని, భవిష్యత్తులో రాజకీయంగా ఎదిగే విధంగా ప్రోత్సహిస్తానన్నారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గానికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ రామకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు, మున్నూరు కాపు సంఘం నాయకులు ఉన్నారు.

ఓపెన్ డిగ్రీలో చేరికకు మరో అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో ఇంటర్, ఎస్సెస్సీ పూర్తి చేసినవారు పీజీ, డిగ్రీలో చేరేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ చేయాలని ఉన్నవారు, ఉద్యోగాలు చేసేవారు దూరవిద్య పద్ధతిలో చదువుకునేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవకాశం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే పలుమార్లు తేదీలను పొడిగించిన ప్రభుత్వం తాజాగా మరోమారు అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 29 వరకు ఎలాంటి ఫీజు లేకుండా చేరవచ్చని, వచ్చే నెల 30లోపు అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీజీలో ఇప్పటికే 1,652 మంది, డిగ్రీలో 877 మంది అడ్మిషన్ పొందారన్నారు. గడువు పూర్తయ్యేలోగా మరింత మంది చేరే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గలవారు సకాలంలో ఫీజులు చెల్లించి అడ్మిషన్లు తీసుకోవచ్చని సూచించారు.

చిన్నారి ఆచూకీ ఏది?

- 12 రోజులు గుడుస్తున్నా కనిపించని పురోగతి
- పోలీసుల పనితీరుపై సర్వత్రా విమర్శలు

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు జనరల్ ఆస్పత్రిలో నాలుగు నెలల చిన్నారి అదృశ్యమై.. 12 రోజులు గడుస్తున్నా ఇప్పటికి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్ శాఖ తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే జిల్లా కోర్టు న్యాయమూర్తి బి.పాపిరెడ్డి సైతం ఈ అంశంపై సీరియస్ అయిన విషయం విధితమే. చిన్నారి గాలింపు చర్యల కోసం పోలీస్ శాఖ ఇప్పటికే మూడు బృందాలు ఏర్పాటు చేసినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. అయితే జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు ఏ ఒక్కటి కూడా పని చేయకపోవడంతో పోలీసులకు కేసు దర్యాప్తు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు చిన్న క్లూ కూడా లభించకపోవడంతో కేసు మరింత జఠిలం అయ్యింది. ప్రస్తుతం పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉండి కూడా ఓ చిన్నారి కేసు ఛేదించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే చిన్నారి కేసు వ్యవహారంలో పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు సాగిస్తున్నారా.. లేక తూతూమంత్రంగా విచారణ చేస్తున్నారా అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసు దర్యాప్తుపై టూటౌన్ సీఐ స్వామిని వివరణ కోరగా ఎలాంటి పురోగతి లేదని.. విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

గతంలోనూ ఘటనలు

జనరల్ ఆస్పత్రిలో చిన్నారులు కిడ్నాప్ కావడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా చాలా సందర్భాల్లో పిల్లలను ఎత్తుకెళ్లిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అయినా అటు ఆస్పత్రి అధికారులు గాని.. ఇటు పోలీసులు గాని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. ఆస్పత్రిలో ఒక అవుట్ పోస్ట్‌తోపాటు ప్రత్యేక రక్షణ విభాగం ఉన్నా కూడా చిన్నారుల కిడ్నాప్‌లు పరపాటిగా మారాయి. ప్రధానంగా ఆస్పత్రిలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయకపోవడం వల్ల అక్కడ జరుగుతున్న ఘటనలు, వచ్చివెళ్లే వారిని తెలుసుకోలేకపోతున్నారు.

విజృంభిస్తోంది!

మంప్స్ (గవద బిళ్లల) దాటికి చిన్నారుల విలవిల

- ఒకరి నుంచి ఒకరికి ఇట్టే వ్యాప్తి
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న వైనం
- జిల్లాలో 300పైకు కేసులు నమోదు



గద్వాల క్రైం: జిల్లాలో గవద బిళ్లల వ్యాధి విజృంభిస్తుంది. ఒకరి నుంచి ఇంకొకరికి వేగంగా వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి బారిన పడిన చిన్నారులు, పిల్లలు నొప్పిని భరించలేక విలవిల్లాడుతున్నారు. పిల్లలు పడుతున్న వేదనను చూసి తల్లిదండ్రులు వైద్యం కోసం ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గద్వాల, గట్టు, ధరూర్, కేటీదొడ్డి, మానవపాడు, శాంతినగర్, రాజోళి, అయిజ, అలంపూర్ తదితర మండలలోని మంప్స్ వైరస్ చిన్నారులను ఇబ్బంది పెడుతుంది. గవద బిళ్లల సమస్యతో పిల్లలు కన్నీరు పెడుతున్నారు. చెవుల కింద, దవడ భాగాల్లో వాపు రావడంతో పాటు తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్లనొప్పి, కీళ్లలో వాపు, నోరు తడారిపోవడం జ్వరం తదితర లక్షణాలతో పిల్లలు బాధపడుతున్నారు. చిన్న పిల్లలకు గవద బిళ్లల సమస్య ఎదురైనపుడు వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య చేప్పులేక దుఃఖంలోకి వెళ్లతున్నారు. ఇలాంటి సందర్భంలో తల్లిదండ్రులు వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాల్సిందిగా వారు వివరిస్తున్నారు. అలస్యం చేసిన ప్రమాదంలో పడి సమస్య మరింత జఠిలమవుతుంది.

భయపడొద్దు



మంప్స్ వ్యాధి భారిన పడిన పిల్లలు వారి తల్లి దండ్రులు భయపడొద్దు. ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. జ్వరం, తలనొప్పి, నీరసించిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇంట్లో ఒక చిన్నారిలో సమస్య గమనిస్తే మిగతవారికీ వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. ఇలాంటి సమయంలో మిగతా పిల్లల నుంచి దూరంగా ఉంచాలి. ఈ వ్యాధికి భయపడొద్దు.. అలాగని నిర్లక్ష్యం చేయరాదు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడడంతో పాటు శక్తినిచ్చే ద్రవాహారాన్ని అందిస్తే త్వరగానే వ్యాధి తగ్గిపోతుంది.

– శ్యాం,
చిన్న పిల్లల వైద్యుడు జిల్లా ప్రభుత్వాసుపత్రి

ఆస్పత్రులకు పరుగులు..

గవద బిళ్లల సమస్యతో చిన్నపిల్లల ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. జిల్లా ప్రభుత్వాసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా పదుల సంఖ్యలో గవద బిళ్లల సమస్యతో వస్తున్నారు. ఇటీవల కాలంలో వందలాది మందికి వైరస్ సోకింది. అయితే కొన్ని కుటుంబాల్లో పిల్లల ద్వారా పెద్దవాళ్లు ఈ వైరస్ బారిన పడుతున్నారు. ఈ సమస్యతో బాధపడుతున్న వారు వారం రోజుల పాటు ఐషోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మంప్స్ వైరస్‌తో బాధపడుతున్న పిల్లలను స్కూల్స్‌కు పంపకుండా ఇంట్లోనే ఉండాలి. తీసుకునే ఆహారంలో తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలి. తగినంత మంచినీరు, పండ్ల రసాలు తీసుకోవాల్సిందిగా వైద్యులు చెబుతున్నారు.

మంప్స్ అంటువ్యాధి

గవద బిళ్లల సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి లేదా చిన్నారుల్లో దగ్గినపుడు, తుమ్మినపుడు, మాట్లాడినపుడు వైరస్ గాలిలో ప్రయాణించి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా 15 సంవత్సరాలోపు పిల్లలలో ఈ సమస్య కనిపిస్తుంది. స్కూల్స్‌కు వేళ్లే పిల్లలో ఒకరికి సమస్య ఎదురైతే తెలియకుండానే ఒకరి ద్వారా అందరికీ వ్యాప్తి చేందే అవకాశాలుంటాయి.



గట్టులో గవద బిళ్లల వ్యాధి బారిన పడిన చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యుడు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

ఉమ్మడి జిల్లా టోర్నీ విజేతగా మహబూబ్‌నగర్



విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి

గద్వాల అర్బన్: క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా మరోసారి గెలుపు దిశగా రాణించేందుకు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్‌గాంధీ స్మారక ఇన్విటేషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఫైనల్‌లో మ్యాచులో శంకర్ ఎలెవన్ జట్టు వర్సెస్ మహబూబ్‌నగర్ జట్లు తలబడ్డాయి. గద్వాల సర్కిల్ సీఐ టాటా బాబు ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన మహబూబ్‌నగర్ జట్టు ఫిల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ చేసిన శంకర్ ఎలెన్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 151 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 18.1ఓవర్లలో 154పరుగులు చేసి విజేతగా, శంకర్ ఎలెవన్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఇరు జట్లకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం పెంపొందుతుందని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు, రన్నర్‌గా నిలిచిన శంకర్ ఎలెవన్ జట్టుకు ట్రోఫితో పాటు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీ చైర్మన్ బండారీ భాస్కర్, శంకర్, డీటీడీసీ నర్సింహ్మా, ఇసాక్, తుమ్మల నర్సింహ్మా, నల్లారెడ్డి, తిమ్మన్న తదితరులు ఉన్నారు.

నేటినుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలు

కోటకదిర నుంచి గుట్టపైకి స్వామివారి ఊరేగింపు

మహబూబ్‌నగర్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 7 గంటలకు కోటకదిరలోని అళహరి వంశీయుల ఇంటి నుంచి ప్రత్యేక పూజలు అనంతరం దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భక్తులు శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామివారిని గుట్టపైకి ఊరేగింపుగా తీసుకువస్తారు. సన్నాయి వాయిద్యాలు, బ్యాండుమేళ తాళాలు, భక్తుల కోలాటాల మధ్య స్వామివారి పల్లకీసేవ ముందుకు కదులుతుంది. కాగడాల వెలుతురులో స్వామివారిని గుట్టపైకి తీసుకువచ్చి సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఉత్సవాలకు ముందు ఈ విధంగా స్వామివారిని కోటకదిర నుంచి గుట్టపైకి తీసుకురావడం అనాదిగా ఆనవాయితీ.



మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

వెలుస్తున్న దుకాణాలు

ఉత్సవాల సందర్భంగా మన్యంకొండలో వివిధ తినుబండారాల దుకాణాలు వెలుస్తున్నాయి. గుట్టపైనున్న తేరు మైదానం, దిగువకొండ వద్ద దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. తినుబండారాలతోపాటు వివిధ ఆట వస్తువులు, వంట, పూజ సామగ్రి, గాజుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే హోటళ్లు, సినిమా హాళ్లు కూడా వెలుస్తున్నాయి.

అభివృద్ధిలో పాలుపంచుకోవాలి



కంచుపాడులో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

ఉండవెల్లి: పార్టీలో చేరిన, ప్రస్తుతం పనిచేస్తున్న కార్యకర్తలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్న దగ్గరుండి చేస్తామని, జిల్లా అభివృద్ధిలో అందరూ పాలుపంచుకోవాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం కంచుపాడులోని సురవరం విజ్ఞాన కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు 200 మంది సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అందరికి అందుబాటులో తీసుకొస్తామన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసులు గౌడు, సత్యారెడ్డి, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రామయ్యచారి, మండల అధ్యక్షుడు గోపాల్, జిల్లా నాయకులు నాగేష్, నరేందర్, షాలు, వెంకటేశ్వర్లు, నాయకులు తేజ, రమణ, శంకర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం..

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో రూ.5లక్షలు, జింకలపల్లిలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సోనియా గాంధీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గత పదేళ్ల పాలనలో నాలుగు సార్లు పేపర్ లీకేజీలు చేసిన ఘనత, ఒక్క కుటుంబానికి కూడా రేషన్‌కార్డు ఇచ్చిన చరిత్ర గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల త్వరలోనే అమలు చేస్తుందన్నారు. ఇదిలాఉండగా, పోటీ పరీక్షల్లో అవరోహణ పద్ధతిలో ఫలితాలు ప్రకటించాలని పలువురు యువకులు ఆయనకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జోగుల రవి, వెంకటేష్ యాదవ్,శ్రీను, రాముడు ఉన్నారు.

ముగిసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి జాతర



క్యూలైన్‌లో భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజున ఆలయ పండితులు స్వామివారి విగ్రహానికి చక్రతీర్థం జరిపించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులచే నిత్యహోమం జరిపించి మహా పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ధ్వజ అవరోహణం గావించి చక్రతీర్థసేవ చేశారు. ద్వాదశారాధనలు, శ్రీపుష్పయాగం, నాగబలి, దేవతోద్వాసన, సప్తవర్ణ సేవలు నిర్వహించారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

పోలీస్ శాఖలో బదిలీల పర్వం

కొత్తగా ఆరుగురు డీఎస్పీలకు స్థానచలనం

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో దశల వారీగా పోలీస్ శాఖలో ఉన్నతాధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పించగా.. మరోసారి ఆదివారం ఆరుగురు డీఎస్పీలు స్థానచలనం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులతోపాటు ఇటీవల వచ్చిన వారికి సైతం బదిలీ చేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఇలా ప్రతి విభాగంలో మార్పులు, చేర్పులు జరిగాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో కొత్తగా విధుల్లో చేరిన అధికారులే కనిపిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రస్తుతం విధుల్లో చేరిన అధికారులు ఆయా ప్రాంతాలపై పట్టు సాధించాల్సి ఉంది. ఒకవైపు నేరాలు, చోరీలు, శాంతిభద్రతలు అదుపు చేయడంతోపాటు.. మరోవైపు ఎన్నికల విధులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.రవిని వరంగల్ జిల్లా అదనపు డీసీపీ(అడ్మిన్)గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గద్వాల జిల్లా అదనపు ఎస్పీగా ఇంకా ఎవరిని కేటాయించలేదు.

డీఎస్పీ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మురళీకృష్ణ	హైదరాబాద్ వెయిటింగ్	డీటీసీ జడ్చర్ల
ఎన్.రామారావు	డీటీసీ జడ్చర్ల	టీఎస్‌పీఏ
నాగభూషణం	డీజీపీ ఆఫీస్	మహబూబ్‌నగర్ ఎస్‌బీ
కిరణ్	మహబూబ్‌నగర్ ఎస్‌బీ	హైదరాబాద్ సిటీ, సీసీఎస్
కృష్ణకిషోర్	అచ్చంపేట, నాగర్‌కర్నూల్	డీసీఆర్‌బీ వర్టికల్స్, వనపర్తి
పార్థసారథి	కల్వకుర్తి, రిపోర్ట్ డీజీపీ ఆఫీస్	ఏసీపీ ఎస్‌బీ, వరంగల్



నల్లమల భద్రం..!

ఎకో సెన్సిటివ్ జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్

- చుట్టూ 10 కి.మీ., పరిధిలో అటవీశాఖ ఆంక్షలు
- పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు
- ఏడు శాఖల సమన్వయంతో కమిటీ ఏర్పాటు
- కేంద్ర ప్రభుత్వ అనుమతి తర్వాతే అమలులోకి..



నల్లమల అటవీ ప్రాంతం



సాక్షి, నాగర్‌కర్నూల్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎకో సెన్సిటివ్ జోన్ ద్వారా నల్లమలలోని వన్యప్రాణులకు హాని లేకుండా ఇక్కడి అరుదైన వృక్ష, జంతుజాతులను పరిరక్షించేలా అధికారులు కసరత్తు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించాక ఎకో సెన్సిటివ్ జోన్ పరిమితులు అమలులోకి వస్తాయి. ఆ తర్వాత నల్లమల చుట్టుముట్టూ సుమారు 10 కి.మీ., దూరం వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణ పనులు చేపట్టాలన్నా ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) కమిటీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాతోపాటు బఫర్ జోన్ ఏర్పాటు ద్వారా రక్షణ కొనసాగుతుండగా.. ఎకో సెన్సిటివ్ జోన్‌తో వన్యప్రాణులకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

జోన్ పరిధిలో 9 మండలాలు..

నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ నిబంధనల ప్రకారం టైగర్ రిజర్వ్‌లో పెద్ద పులులకు అనుకూలమైన వాతావరణం కొనసాగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇందుకు ఆటంకం కలిగించే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. జిల్లాలోని అమ్రాబాద్, పదర మండలాల్లోని అన్ని గ్రామాలతోపాటు అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, లింగాల మండలాల్లోని అటవీ ప్రాంత సమీప గ్రామాలు ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోకి రానున్నాయి. వీటి పరిధిలో మైనింగ్ తవ్వకాలు, బ్లాస్టింగ్, కాలుష్య కారక పరిశ్రమలపై ఆంక్షలు ఉంటాయి. అలాగే విద్యుత్ లైన్ల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు కమిటీ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది.

పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

ఎకో సెన్సిటివ్ జోన్ పరిరక్షణకు జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్షణ బాధ్యత చేపట్టనుంది. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా.. డీఎఫ్‌ఓ కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్లు, అటవీ, రెవెన్యూ, వ్యవసాయ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ఖనిజాలు, విద్యుత్ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారు.

ఎకో టూరిజం వైపు అడుగులు

నల్లమల అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అటవీశాఖ కృషిచేస్తోంది. ఇప్పటికే మన్ననూర్ కేంద్రంగా టైగర్ స్టే ప్యాకేజీలు, ట్రెక్కింగ్, జంగిల్ సఫారీ వంటివి చేపడుతోంది. ఇందులో స్థానిక చెంచు యువకులను టూరిస్టు గైడ్లు, ఫారెస్ట్ వాచర్లుగా నియమిస్తోంది. ఇక ముందు కూడా ఈ కార్యక్రమాలను విస్తృతపర్చడం ద్వారా ఎకో టూరిజం సర్వీసులను మరింత అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకుల కోసం వసతులు పెంచడం ద్వారా మరింత మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీవవైవిధ్యం కొనసాగేలా..

నల్లమల అడవిలోని జీవ వైవిధ్యాన్ని సంరక్షించడంతోపాటు వన్యప్రాణులకు, స్థానికులకు మధ్య ఘర్షణను నివారించేందుకు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు కానుంది. నల్లమలలోని పులులు, వన్యప్రాణులకు హానికరమైన పరిస్థితులు తలెత్తకుండా, సరిసృపాలు, తేనె టీగలు, ఇతర అరుదైన జంతువుల మనుగడకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోనున్నారు. కోర్ ఏరియాతోపాటు సమీప ప్రాంతాల్లో వన్యప్రాణులకు అనుకూల వాతావరణం కల్పిస్తారు.

■ 1986 అటవీ, పర్యావరణ పరిరక్షణ చట్టం, నేషనల్ వైల్డ్ లైఫ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్దేశిత అటవీ ప్రాంతాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు అవకాశం ఉండగా.. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఎకో సెన్సిటివ్ జోన్‌లో ప్రధానంగా వన్యప్రాణుల వేట, మైనింగ్, రంపపు మిల్లులు, కాలుష్య కారక పరిశ్రమలు, శబ్దం చేసే పరిశ్రమలు, వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలిగించే అంశాలపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయి. అలాగే చెట్ల నరికివేత, నీటిని వాణిజ్య అవసరాలకు వినియోగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు, వ్యవసాయంలో పురుగు మందు వినియోగంలో ఆంక్షలు విధిస్తారు. రోడ్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాటు, తవ్వకాలు చేపట్టేందుకు మాత్రం ఎకో సెన్సిటివ్ జోన్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకొని పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. వ్యవసాయంతో పాటు చేపల పెంపకం తదితర అనుబంధ పనులకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ చుట్టుపక్కల ప్రాంతాలను ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. నల్లమల అటవీ ప్రాంతం, అరుదైన వన్యప్రాణుల రక్షణ కోసం ఎకో సెన్సిటివ్ జోన్ ఉపయోగపడనుంది. అటవీ ప్రాంతం సమీపంలో చేపట్టే కార్యక్రమాలపై కమిటీ ద్వారా ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది.

– రోహిత్, డీఎఫ్‌ఓ, నాగర్‌కర్నూల్

అతిథి అధ్యాపకుల అవస్థలు

- విద్యాసంవత్సరం ముగుస్తున్నా.. అందని వేతనాలు
- ఉమ్మడి జిల్లాల్లో 250 మంది..

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు సరిగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అర్ధాకలితో పాఠాలు బోధిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 56 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 250 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను జూన్ నుంచి విధులకు హాజరవుతున్నా 4 నెలలకు ఓసారి మాత్రమే ఇంటర్‌బోర్డు వేతనాలు చెల్లిస్తోంది. 2023, ఫిబ్రవరి బడ్జెట్‌లో అతిథి అధ్యాపకులకు 12 నెలల వేతనం అందజేయాలని అధికారులకు అప్పటి ముఖ్యమంత్రి ఆదేశించినా ఫలితం శూన్యం.

ఆటో రెన్యూవల్ లేదు..

అతిథి అధ్యాపకులకు ఆటో రెన్యూవల్ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్‌బోర్డు కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గెస్ట్ లెక్చరర్లు హైకోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టిన ధర్మాసనం కొత్త నోటిఫికేషన్ చెల్లదని.. పాత వారినే కొనసాగించాలని, ఆటో రెన్యూవల్ ఇవ్వాలని తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడంతో గెస్ట్ లెక్చరర్లు తమ ఆందోళనను ఉధృతంగా చేయడంతో సమస్య కొద్దిమేర సద్దుమణిగింది.

గుర్తింపు కరువు..

అతిథి అధ్యాపకులు పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా సరైన గుర్తింపు లేకపోవడంతో పాటు రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమానంగా పనిచేసి శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఇంటర్‌బోర్డు కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు (ఫైల్)

కొత్త ప్రభుత్వంలోనైనా..

ప్రతి ఏటా జూన్ 1 నుంచి మరుసటి ఏడాది మార్చి 31 వరకు గెస్ట్ లెక్చరర్లు విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. అందుకు అనుగుణంగా గత ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అయినప్పటికీ తమ వేతనాలపై ఇంటర్‌బోర్డు పట్టింపులేని వైఖరి కనబరుస్తుందని గెస్ట్ లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా 3, 4 నెలలకు ఓసారి వేతనాలు చెల్లిస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వం కొందరిని క్రమబద్ధీకరించిందని.. అదే తరహాలో తమపై జాలి చూపకపోగా వేతనాలు సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులు సృష్టిస్తుందని వివరించారు. కొత్త ప్రభుత్వమైనా విద్యాసంవత్సరం ముగిసేలోపు పెండింగ్ వేతనాలు చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. ఆటో రెన్యూవల్‌తో పాటు కోర్టు ఆదేశాలు అమలు చేయాలని వేడుకుంటున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా..

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, జేఏసీ చైర్మన్ కోదండరాం, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు రెండురోజుల క్రితం ఇంటర్ విద్యాకమిషనర్ శృతి ఓఝాకు గెస్ట్ లెక్చరర్లు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించడంతో పాటు వేతనాలు అందించాలని కోరుతున్నారు.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	కళాశాలలు	అతిథి అధ్యాపకులు
నాగర్‌కర్నూల్	15	73
మహబూబ్‌నగర్	13	63
వనపర్తి	12	47
జోగుళాంబ గద్వాల	8	35
నారాయణపేట	8	32

ఉద్యోగ భద్రత కల్పించాలి..



హైకోర్టు తీర్పును అమలు చేయడంతో పాటు ఎంటీఎస్ (మినిమం టైమ్ స్కేల్) ఇవ్వాలి. రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమానంగా పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నాం. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు 72 పీరియడ్స్ విధానాన్ని రద్దుచేసి 12 నెలల కన్సాలిడేట్ పే ఇవ్వాలి. కాంగ్రెస్‌పార్టీ మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సదానందంగౌడ్, రాష్ట్ర నాయకుడు, గెస్ట్ లెక్చరర్ల సంఘం

నాగర్‌కర్నూల్ డీఈఓపై దాడికి యత్నం



అధికారులను చుట్టుముట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు

- ప్రొటోకాల్ విస్మరించారంటూ ఆగ్రహం
- పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే.. వెనుదిరిగిన ఎమ్మెల్యే

తాడూరు: మండలంలోని సిర్సవాడలో ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవంలో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ప్రొటోకాల్ పాటించకుండా తమను అవమానపర్చారంటూ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అనుచరులు దాడికి యత్నించారు. పోలీసులు వెంటనే డీఈఓను స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎంజేఆర్ ట్రస్టు ద్వారా గ్రామంలో ఆధునిక హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఆదివారం పాఠశాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కానీ ఆయన హాజరయ్యే సమయానికి ముందే మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రారంభించడంతో ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాల భవనానికి బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు డీఈఓను ప్రశ్నిస్తూ దాడికి యత్నించారు. వెంటనే పోలీసులు డీఈఓను అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తనను ప్రారంభోత్సవానికి పిలిచి అవమానించారంటూ డీఈఓ, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించకుండానే వెనుదిరిగారు.

ప్రారంభోత్సవం వాయిదా..

కందనూలు: ప్రొటోకాల్ ఉల్లంఘన కారణంగా సిర్సవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా వేసినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల హెచ్‌ఎం చాంద్‌పాషాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, దాత, ఎంజేఆర్ ట్రస్ట్ అధినేత మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించామన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆయన అనుచరులతో ముందుగానే వచ్చారని.. ప్రధానోపాధ్యాయుడు వద్దని వారించినప్పటికీ వినిపించుకోకుండా వెంట తెచ్చుకున్న రిబ్బన్‌ను పాఠశాల గేట్‌కి కట్టి ప్రారంభించారని తెలిపారు. అనంతరం లోపలికి వచ్చి 2022లో వేసిన నిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ప్రారంభించి వెళ్లారని వివరించారు. తర్వాత వచ్చిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వచ్చి హెచ్‌ఎంతో మాట్లాడి వివరాలు తెలుసుకొని వెనుదిరిగారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రొటోకాల్‌ను ఉల్లంఘించినందుకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే.. : మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు: తన చివరి శ్వాస వరకు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన సిర్సవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నప్పుడు తను, తన సోదరుడు ఈ పాఠశాలలోనే చదువుకున్నామని.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ట్రస్టు ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లతో అన్ని వసతులతో కార్పొరేట్‌కు దీటుగా నిర్మించామన్నారు. తిమ్మాజిపేటలోనూ నిర్మించి ప్రారంభించామని.. త్వరలోనే తాడూరు, కుమ్మెరలో నిర్మించిన పాఠశాల భవనాలను ప్రారంభిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి మర్రి జమున, సోదరుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ శ్రీదేవి, డీఈఓ గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యురాలు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్–జడ్చర్ల ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భూత్పూర్ మండలం తాటిపర్తికి చెందిన బిజిలి శివకుమార్(21) తన మిత్రుడు చాపల శివకుమార్‌తో కలిసి శనివారం రాత్రి బైక్‌పై గంగాపూర్ జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. బైక్‌పై జడ్చర్ల వైపునకు వస్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వైద్యచికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదేరోజు అర్ధరాత్రి బిజిలి శివకుమార్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

ఆత్మహత్య కేసులో వ్యక్తి రిమాండ్

బిజినేపల్లి: మండలంలోని పాలెంకు చెందిన పుష్పలత ఈ నెల 5న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలెంకి చెందిన శ్రీకాంత్, పుష్పలతతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసికంగా వేధించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. శ్రీకాంత్ ఈ విషయాన్ని ఒప్పుకోవడంతో అతడిని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలియజేశారు.

చీటి డబ్బులతో మహిళ పరారీ

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని కేడీఆర్ కాలనీలో నివాసముంటున్న ఉషారాణి కాలనీ వాసులతో కలిసి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు చీటీలు వేసేది. ఈక్రమంలో చీటి డబ్బుల కోసం పాడుపుదారులు వెళ్తే.. ఈ సారి డిప్ మీకు రాలేదని.. చీటి అనంతరం డబ్బులు ఇస్తానని నమ్మబలకడంతో పాటు ప్రమిసరీ నోట్ రాసిచ్చింది. ఈనెల 1వ తేదీన చీటి డబ్బులు ఇస్తానని చెప్పిందని.. ఇంటికి వెళ్లి చూస్తే తాళంవేసి ఉన్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బస్సులో బంగారం చోరీ

తెలకపల్లి: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో నుంచి బంగారం చోరీ జరిగింది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె శిరీష ఈ నెల 13న నాగర్‌కర్నూల్ వెళ్లేందుకు అచ్చంపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యంలో ఇద్దరు వృద్ధ మహిళలు బస్సు ఎక్కి మోకాలు నొప్పులు ఉన్నాయని శిరీషను సీటు అడిగారు. ఆమె లేచి నిలబడి ఆ సీటు మహిళలకు ఇచ్చింది. శిరీష బ్యాగు కూడా అదే సీటులో పెట్టుకుని కూర్చున్నారు. తెలకపల్లి సమీపంలోని పర్వతాపూర్ రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఆ మహిళలు హడావుడిగా దిగి వెళ్లిపోయారు. శిరీష నాగర్‌కర్నూల్ వెళ్లి తన బ్యాగు తెరిచి చూడగా.. బ్యాగులోని ఆరున్నర తులాల బంగారం కనిపించలేదు. శిరీషకు తన సీటులో కూర్చున్న మహిళలే బంగారం చోరీ చేసి ఉంటారని శిరీష తండ్రి శ్రీనివాసులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ముగిసిన ధన్వంతరి వెంకన్న బ్రహ్మోత్సవాలు



బల ప్రదర్శనలో పాల్గొన్న వృషభరాజులు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం వృషభరాజుల బండలాగు పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎద్దులు పోటీల్లో తలపడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ రాత్రి వరకు కొనసాగింది. అదేవిధంగా ఇసుక సంచి, సందెరాళ్లు, దొబ్బడ గుండ్లు ఎత్తే పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే విజయుడు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

గుబ్బల గుండు ఎత్తు పోటీలో వడ్డేపల్లి మండలం జూలకల్లుకు చెందిన రంగస్వామి ప్రథమ, రాజోళి మండలం పచ్చర్లకు చెందిన షకీర్ ద్వితీయ బహుమతులు సాధించారు. ఇసుక సంచి ఎత్తే పోటీల్లో రాయచూరు జిల్లా దేవదుర్గంకు చెందిన పరుశరాంనాయక్ ప్రథమ, యాదగిరి జిల్లా శారదపల్లికి చెందిన మరియప్పనాయక్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సందరాళ్ల ఎత్తు పోటీలో గట్టు మండలం మిట్టదొడ్డికి చెందిన ఉరుకుందు ప్రథమ, గట్టు మండలం బల్గెరకు చెందిన హనమంతు ద్వితీయ బహుమతులను సాధించారు. దొబ్బడ గుండ్లు ఎత్తు పోటీల్లో గద్వాల మండలం వెంకటపురం గ్రామానికి చెందిన లాల్‌బాషా ప్రథమ, రాజోళి మండలం పచ్చర్లకు చెందిన ఉపేంద్ర ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. బాస్కెట్‌బాల్ పోటీల్లో అట్మస్కి జట్టు ప్రథమ, డాన్ బాస్కో జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

పాలెం వెంకన్నకు చక్రస్నానం

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయ అర్చక బృందం అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామికి ఆదివారం చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరిరోజు నిత్యారాధన హోమం, పూర్ణాహుతి, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించి ఆలయబావి వద్ద చక్రస్నానం పూర్తి చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి వీధుల్లో ఊరేగించగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. మేళతాళాలు, భక్తి కీర్తనలు, భజనలతో కోలాహలంగా మారింది.



ఆలయ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న సూర్యం

ఆత్మకూర్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సూర్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూర్‌లో మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని, ఈపీఎఫ్‌ను నిబంధనల ప్రకారం అమలు చేయాలని, ఈఎస్‌ఐ కార్డులను పంపిణీ చేయాలన్నారు. కార్మికులకు పెంచిన వేతనాలను ఇవ్వాలని, అవసరమైన సామగ్రిని సమకూర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హన్మంతు, రాజు, ప్రసాద్, సామేలు, ప్రేమరత్నం, వెంకటేష్, సత్యన్న, ఏసేపు, ఇస్మాయిల్, మైను, దశరథ్, రమేష్, పద్మ, శివకుమార్, రేణుక, సత్యమ్మ ఉన్నారు.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగ కొనసాగుతుంది. ఆదివారం 1,018 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వార వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

ఎర్రవల్లిలో దొంగల హల్‌చల్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణం, కిరాణ షాపులతో పాటు కొండేరులోని ఓ ఇంట్లో చోరీ చేసేందుకు యత్నించారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి చోరీలకు పాల్పడకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. దొంగల సంచారానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిషయంపై ఎస్‌ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



రాష్ట్ర తైక్వాండో కరాటే అసోసియేషన్ కార్యవర్గం

గద్వాల: తెలంగాణ రాష్ట్ర తైక్వాండో కరాటే అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గం ఎన్నికకు తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి అచ్యుత్‌రెడ్డి, శరత్‌చంద్ర ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసోసియేషన్ల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో కరాటే అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ముత్తా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి ఎన్నికయ్యారు. టెక్నికల్ చైర్మన్‌గా వెంకటస్వామి, టెక్నికల్ డైరెక్టర్లుగా మల్లికార్జున్‌గౌడ్, రామాంజనేయులు, కోశాధికారిగా సంతోష్, స్టేట్ ఆఫీస్ సెక్రెటరీ రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శ్రీహరి గద్వాల వాసి. ఈయన ఎన్నిక కావడం ఇది మూడో సారి. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని వివిధ జిల్లాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎన్నికైన వారు పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత: కేసు నమోదు

తాడూరు: మండలంలోని మేడిపూర్ వద్ద దుందుభి వాగు నుంచి అక్రమ ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుట్ట మహేష్ తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా.. సమాచారం మేరకు పట్టుకుని స్టేషన్ ఆవరణలో ఉంచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పేర్కొన్నారు.



స్టేషన్ ఆవరణలో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

టిప్పర్ పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ ఆదివారం తెలియజేశారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొండపేట సమీపంలోని కృష్ణానది నుంచి టీఎస్ 33 టి 5382 నంబర్ టిప్పర్‌లో ఎర్రవల్లికి శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి కేజీబీవీ సమీపంలో పోలీసులు తనిఖీ చేసి ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. అనంతరం టిప్పర్‌ను పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు మధ్యాహ్న భోజనం

అచ్చంపేట: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు పంటలు విక్రయించేందుకు వచ్చే రైతులకు సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరై ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేరుశనగ పంటలు అమ్ముకునేందుకు వచ్చిన రైతుల ఆకలిని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంటలు అమ్ముకునేందుకు రైతులు మార్కెట్‌కు వస్తున్నారని, వారు రోజంత లేదా రెండు రోజులు కూడా మార్కెట్లో ఉండాల్సిన పరిస్థితి గమనించి భోజన ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ప్రత్యేకాధికారి సరోజ, మార్కెట్ కార్యదర్శి నర్సింహ, కౌన్సిలర్ గౌరిశంకర్, ఎ.గోపాల్‌రెడ్డి, కటకం రఘురాం, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు అండగా ఉంటాం..

భవన నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న తాపీ మేస్త్రీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మిగిలిన భవన నిర్మాణ పనుల కోసం రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నెల లేబర్ అధికారితో సమావేశం ఏర్పాటు చేసిన తాపీ మేస్త్రీల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడు బోయ ఖాజ, కిష్టయ్య, డి.తిరుపతయ్య, గార్లపాటి సుదర్శన్, అర్జునయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పిల్లల కిడ్నాప్‌కు యత్నం

అడ్డాకుల: కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చిన్న పిల్లలను ఎత్తుకెళ్లడానికి యత్నించిన ఘటన మూసాపేటలో ఆదివారం కలకలం రేపింది. గ్రామస్తుల కథనం మేరకు.. ముగ్గురు వ్యక్తులు ఆటోలో గ్రామానికి వచ్చి రేషన్ బియ్యం కొంటామని వీధుల్లో తిరిగారు. ఇందులో ఒకరు కుమ్మరి గేరిలో తిరుగుతూ కుమ్మరి నగేష్ కుమారుడిని పట్టుకుని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. కొద్ది దూరం వెళ్లాక ఆ బాలుడు వారిని రాయితో కొట్టి తప్పించుకున్నాడు. ఇంతలోనే అక్కడున్న వారు అరవడంతో వారు పారిపోయారు. స్థానికులు ఊరంతా గాలించినా దొరక్కపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని గ్రామంలో మైక్‌ద్వారా ప్రచారం చేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది. దీనిపై ఎస్‌ఐ కె.సుజాత మాట్లాడుతూ.. చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే వారు గ్రామాల్లో తిరుగుతున్నారన్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు.

నల్లమలలో కార్చిచ్చు

- ఫైర్ వాచర్‌కు గాయాలు

అమ్రాబాద్: నల్లమలలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. అమ్రాబాద్ మండలంలోని తాడిగుండాల, తిమ్మారెడ్డిపల్లి, వజ్రాలమడుగు ప్రాంతాల్లో ఆదివారం మంటలు చెలరేగాయి. గుర్తించిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. అదుపులోకి రాలేదని సమాచారం. దాదాపు 10 కి.మీ. మేర అటవీ ప్రాంతం కాలిపోయినట్లు తెలుస్తోంది. అయితే మంటలను ఆర్పుతున్న క్రమంలో ఫైర్ వాచర్ పోతయ్యకు గాయాలయ్యాయి. వేసవిలో అటవీ ప్రాంతాన్ని అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు ఫైర్ వాచర్లను నియమిస్తారని, వారికి పూర్తి స్థాయి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలపెంట రేంజ్ పరిధిలో అటవీ సంరక్షణకు బాధ్యతగా పనిచేస్తున్నామని, అయినప్పటికీ అక్కడక్కడ మంటలు అంటుకుంటున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ గురుప్రసాద్ తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

